# పదిరూపాయలనోటు

చల్లా సుబ్రహ్మణ్యం

నాకు చాలా చిరాగ్గా ఉంది. అసహనంగా ఉంది.

వారం క్రితం భోజనాని క్కూడా లేకపోతే, వంద రూపాయాలకు దాన్ని తాకట్టు పెట్టిన విషయం మరిచిపోయి, ఎడమ చేతి మణికట్టును తిప్పి గడియారం చూసుకోబోయి చప్పున చేయి దించేశాను.

టైం చూసుకునే అలవాటును మానుకోలేకపోతున్నాను. ఎండ నా కడుపులో ఆకలిలాగే మండిపోతోంది. నా గుండె కూడా మండిపోతోంది.

చేతికి అందమైన గడియారాలున్న ప్రతి ఒక్కర్నీ కసిగా చూస్తూ నడుస్తున్నాను. చిక్కడపల్లి వంతెన దాటుతుండగా అప్పుడు గుర్తొచ్చింది నాకు. అసలు వాచీలున్న ప్రతి వాణ్ణీ కోపంగా చూస్తూ నడవాలన్న నిర్ణయానికి నే నెందు కొచ్చాను? నాకు వాచీ లేదు గనుక.

ఆ విషయం నా కెప్పుడు గుర్తొచ్చింది? టైం చూసుకుందామని చే యెత్తినప్పుడు.

ఎస్. ఇప్పుడు ప్రస్తుతం తొందరగా నేను పరిష్కరించుకోవాల్సిన సమస్య టై మెంతో కనుక్కోవడం.



**జేబులో డబ్బు లేదు కదా అని కడుపు అరవక మానదు; కళ్ళు చూడక మానవు. అయినా మరి ఉన్నది ఒక పది రూపాయల నోటే అయినప్పుడు, అది కూడా చెల్లదు పో - అని దుకాణం వాడు మొహాన విసిరేసినప్పుడు-**

**ఆ నోటు గల ఆసామి 'ఫేటు' ఎలాటిదోనని అల్లిన చిత్రం ఇది!**

"ఎక్స్‌క్యూజ్‌మీ - టైమెంత?"

అప్పుడే సుష్టుగా భోజనం చేసినవాడిలా ఆయాసపడుతూ నా కెదురుగా వస్తున్న ఒకతన్ని అడిగాను.

అతను నన్ను నఖశిఖపర్యంతం ఓసారి చూసి నడుస్తూనే అన్నాడు. "స్...స్...స్..."

అది భుక్తాయాసం వల్ల వచ్చిన తేన్పో, టైం చెప్పడం తెలీకో!

జన్మలో ఇం కెవ్వర్నీ టైం అడక్కూడదని నిర్ణయించుకుని నడవసాగాను. చాలా హడావుడిగా, కంగారుగా నడుస్తున్నాను.

అవును. నన్ను చూసిన ప్రతివాడూ - వీడు ఉద్యోగం లేని వెధవ అనీ, రెండేళ్ళుగా నిరుద్యోగిలా భాగ్యనగర వీథుల్లో ఉద్యోగ భాగ్యంకోసం వెదుక్కుంటున్నాడనీ ఎందు కనుకోవాలి?

అదిగో - వాడు చూడు, బానలాంటి బొజ్జను. అనవ్యాంగా కదిలించుకుంటూ చేతిలో సంచీతో, జేబులో రెండు పెన్నుల్తో, పెన్నుల పైనుంచి కనిపిస్తున్న బస్ పాస్‌తో ఎంత కంగారుగా నడుస్తున్నాడో!

పెళ్ళానికి తలనొప్పి వచ్చి పడుకుంటే - వంట చేసి తినిపించి, తా నింత ఎంగిలిపడి హడావుడిగా ఆఫీస్‌కు బయలుదేరినట్టు... తాను ఆఫీస్‌లో పని చేయకపోతే దేశ ప్రగతి కుంటుపడి పురోగమనం ఆగిపోతున్నట్టు!

వెళ్ళరా - వెళ్ళు! హాయిగా ఆఫీస్ కెళ్ళి ఫాన్ కింద కూర్చుని - ఫైళ్ళ తలగడమీద తలాన్చి గుర్రుకొట్టి నిద్రపో... స్వీట్ డ్రీమ్స్ బాస్!

వేగంగా వస్తున్న బస్‌ను చేయెత్తి కంగారుగా ఆపే ప్రయత్నం చేస్తున్న వాడిని అనవ్యాంగా చూస్తూ నడుస్తున్నాను.

బస్ ఆగలేదు.

విశ్వామిత్రుడి లెవెల్లో బస్‌ను చూసి తిరిగి బొజ్జ కదిలిస్తూ నడవసాగాడు.

అవును... ఈ రోడ్ మీద తిరిగే ప్రతి ఒక్కడూ ఏదో ఒక పనిమీద వెళ్తున్నాడు. నేను తప్ప!

చొక్కా చెమటతో తడిసి శరీరానికి అంటుకుపోతూ - చాలా చిరాగ్గా ఉంది నాకు. వంద రూపాయల్లో పది రూపాయల నోటు మిగిలింది. అది మార్చాలంటే భయంగా ఉంది. నాలుగు రోజులుగా మంచినీళ్ళతో ఆకలిని చల్లార్చుతున్నానే తప్ప ఆ పది రూపాయలను మార్చలేదు. మారిస్తే - ఆ తరువాత తాకట్టు పెట్టడానికి కూడా ఏమీ లేదు నా దగ్గర.

నా స్థానంలో ఉన్న అమ్మాయి ఏ మాలోచిస్తుంది? తాకట్టు పెట్టడానికి ఏమీ లేదు. ఒక్క శీలం తప్ప - అనుకుంటుందా?

'తప్పురా వెధవా! అలాంటి వెధ వాలోచనలు రానివ్వకు!' నా మనస్సు గద్దించింది.

అసలు నేను అమ్మాయినై పుడితే - చాలా బావుండేది. ఎక్స్ - వై - క్రోమోజోమ్స్ నా తలరాత నిలా రోడ్లపాలు చేశాయి. అమ్మాయినైతే - వాచీ తాకట్టు పెట్టకుండా - అదిగో - చిక్కడపల్లి బస్ స్టాప్ దగ్గర వయ్యారంగా నిల్చుని, అడుగో మెళ్ళో బంగారు గొలుసు, చేతికి నాలుగు ఉంగరాలున్న ఆ టీషర్ట్ గాడిమీద చూపుల శరాలు సంధిస్తే చాలు! నెల రోజులు హాయిగా భోజనం ఖర్చు సంపాదించుకోవచ్చు.

"బలపం పట్టి భామ ఒళ్ళో అఆ ఇఈ నేర్చుకుంటా!" కేసెట్లు అమ్మే షాపునుంచి పెద్దగా వినిపిస్తోంది పాట.

నాకు న వ్వొచ్చింది. పక్కున నవ్వాను. అప్పుడే. నన్ను దాటి వెళ్తున్న ఓ ప్రౌఢ మింగేసేలా చూస్తూ వెళ్ళిపోయింది.

వెధవ దేశం! హాయిగా నవ్వుకునే హక్కు కూడా లేదు! ఛు!

అవును నా కసలు న వ్వెందు కొచ్చింది? ఆ పాటకు నా పేరడీ గుర్తొచ్చి. కడుపు మండుతుంటే - పేరడీలు ఎందుకు? కడుపు మంటను మరచిపోడానికి.

మరిచిపోయావా? లేదు - ఎక్కువైంది!

ఏదో మెస్ ఈరోజే ప్రారంభిస్తు న్నట్టున్నారు. షామియానా - జనం - మైక్‌లో పాటలు - హడావుడి.

'మెస్ ప్రారంభోత్సవం రోజు - ఊరికే భోజనం పెడతారా? పెడతారు. తెలిసిన వారికి. నీలాంటి వాడిక్కాదు.'

చిరాగ్గా విసుక్కుంది నా మనస్సు. అయినా 'ధైర్యే సాహసే లక్ష్మి' అనుకుని లోపలికి వెళ్ళాను.

"రండి సార్ రండి! మీలాంటి వారి ఆకలే మా పెట్టుబడి. ఈ ఒక్క రోజూ ఫ్రీగా తినండి. రేపట్నుంచి మా మెస్‌కి రండి....." అంటూ లేచి నిలబడి ఆదరంగా ఆహ్వానిస్తాడనుకున్న మెస్ వాడు, నేను - టేబుల్ మీద పెట్టిన పది రూపాయల నోటు చూసి -

"ప్లేటా - ఫుల్లా" చిరాగ్గా అడిగాడు.

"ప్లేట్!"

అసలు ఆకలి లేక - కేవలం వాడి మెస్‌ను ఉద్ధరించడానికే భోజనం చేస్తున్న వాడిలా నిర్లక్ష్యంగా అన్నాను.

"ఇది చెల్లదు. ఇం కొకటివ్వు" పది రూపాయలు విసిరి అన్నాడతను.

గతుక్కుమన్నాను.

చేతిలో వాడు చించిచ్చిన టోకెన్ ఉంది.

"ఏమైంది దీనికి?" అలాంటి పది రూపాయలు ఓ వంద కనీసం జేబులో ఉన్న వాడిలా కోపంగా అడిగాను.


"కనిపించడంలే? చిరిగింది." అసహనంగా అన్నాడు.

'రేయ్ దుర్మార్గుడా!' ఇది నేను ప్రింట్ చేసిన నోటు కాదురా - కాగితం చిరిగితే అది నా తప్పు కాదు. చిరగడం దాని లక్షణం. కానీ నోటి దగ్గర కూడు తీయకొరేయ్!'-

"ఇప్పుడన్నీ ఇలాగే వస్తున్నాయి" - రిజర్వు బ్యాంకు గవర్నర్ లెవెల్లో అన్నాను. 'పోనీ నీ దగ్గర అన్ని నోట్లున్నాయి గదా? ఎవడికైనా అంటగట్టెయ్ - కడుపు మండిపోతోందిరా చెల్లదనకు. ప్లీజ్! చేతిలో టోకెన్ గట్టిగా పట్టుకున్నాను.

"చెల్లదయ్యా బాబూ - ఇస్తే వేరే నోటివ్వు లేదా బయటకు నడు" కోపంగా అరిచాడు.

ఫుట్‌పాత్ మీద నడుస్తున్నాను. ఇప్పుడు ఆకలి కన్నా



మెస్ వాడి మాటలు బాధ కలిగిస్తున్నాయి. రత్నాకేఫ్ ముందున్న పాన్ దుకాణం దగ్గర నిల్చున్నాను.

"ఈ రోజు స్పెషల్ మసాల దోసె."

హోటల్ ముందు బోర్డ్ మీద అక్షరాలు చూసి నోట్లో నీళ్ళూరి ..... అవును - మసాలా దోసెను నేను ఆఖరిసారి ఎప్పుడు తిన్నాను? మొదటి పానిపట్టు యుద్ధం జరిగిన సంవత్సరం గుర్తొచ్చింది. కానీ - మసాలా దోసె తిన్న సంవత్సరం గుర్తురాలేదు.

"రెండు చార్మినార్ సిగరెట్లు." పది రూపాయలు ఇస్తూ అడిగాను. దేవుడి దయవల్ల ఇప్పుడైనా ఈ నోటు మారితే తొందరగా వెళ్ళి మసాలా దోసె తినాలి.

రెండు సిగరెట్లు ఇచ్చి పది రూపాయలు గల్లా పెట్టెలో వేసి చిల్లర లెక్కిస్తూ...

ఏమైనా సరే. మసాల దోసె తిన్న ఈ రోజును తను చాలా జాగ్రత్తగా గుర్తుంచుకోవాలి...

"ఇది చెల్లదు. మరొకటివ్వు.." విసురుగా పది రూపాయలు విసిరేసి అన్నాడు.

నేను మాట్లాడలేదు. నిశ్శబ్దంగా పది రూపాయలు తీసుకుని జేబులో వేసుకుని నడవసాగాను.

"ప్రియతమా - నను పలకరించు ప్రణయమా.. అతిథిలా.."

పీకల వరకూ మెక్కి - తిన్నది అరక్క ఒళ్లు బలిసి పాడే పాటలు. ఛీఛీ ! ఇప్పుడు పేరడీ చేసే ఓపిక నశించి - పాట వినబడకుండా ఉండాలని చాలా వేగంగా నడవసాగాను.

ఎదురుగా ఓ పాతికేళ్ళ అమ్మాయి వస్తోంది.

నా కళ్లు బిజీగా చదివేస్తున్నాయి. కళ్ళు - ముక్కు బాగానే ఉన్నాయి. ఆ పెదవులు కూడా.. అబ్బ సిల్క్‌స్మిత పెదవుల్లా ! మెడలో బంగారు గొలును తళుక్కుమంటూ - హిమాలయ పర్వతాల నడుమ సూర్యుడి కిరణంలా మెరుస్తూ.

నడుము మీద మడత కొందరికి అసహ్యంగా ఉంటే - కొందరికి అందంగా ఉంటుంది. ఈ అమ్మాయికి అద్భుతంగా ఉంది. ఆ మడత ఒంపులో నా చెక్కిలి అన్ని యుగాలు గడిపేయొచ్చు.

'ఆకలిరా వెధవా !' మనస్సు ఆక్రోశించింది.

ఈ అమ్మాయిని అప్పు అడిగితే పిచ్చివాడిలా చూస్తుందా? టీజ్ చేస్తున్నానని కేకలు పెడుతుందా? అవును పెళ్ళి కూడా అయినట్టు లేదు. కాళ్ళను చూస్తే తెలిసిపోతుంది.

అదృష్టవంతుడివిరా రాస్కెల్ ! నాకు తెలీని ఆమె మొగుణ్ణి తిట్టుకున్నాను. ఆ మడత వంపు - ప్రతి రాత్రి స్పృశిస్తూ - ముద్దాడుతూ - అసలీ మహోన్నతమైన సౌందర్యాన్ని ఎస్ - ఈ అమ్మాయి నగ్నంగా ఎలా ఉంటుంది?

'చీమూ, నెత్తురూ మలమూత్రాలతో నిండిన తొమ్మిది రంధ్రాలున్న తోలు తిత్తి !' మనస్సు శపించింది.

నా నడక వేగం పెరిగింది. తోలు తిత్తి నన్ను దాటిపోయింది.

నాకు చిరాగ్గా ఉంది. అసహనంగా వుంది.

బాగ్‌లింగంపల్లి పార్క్‌లో ఉలిక్కిపడి లేచాను. సూర్యుడు పడమటి భవనాల వెనక్కు ఇంకిపోతున్నారు.

పార్కుల వల్ల ఉపయోగమేమిటి? ఆకలేసి శోషొస్తే విశ్రాంతి తీసుకోవచ్చు.

నిద్రపోయి లేచినందుకు నాకు రవ్వంత ఉత్సాహంగా ఉంది. పాంటు వెనక జేబులోంచి దువ్వెన తీసి తలదువ్వుకున్నాను. పార్క్‌లో పైపు దగ్గర ముఖం కడుక్కుని రుమాలుతో తుడుచుకున్నాను. మళ్ళీ తలదువ్వి అద్దం లేనందుకు ఓ క్షణం విచారించి - తిరిగి నడవసాగాను. ఉదయం నుంచే సాయంత్రం వరకూ వ్యాపారం గొడవలు చూసుకుని - కారున్నా - నడక ఆరోగ్యానికి మంచిదని చెప్పిన డాక్టర్ సలహా మేరకు తీరికగా నడుస్తున్న వాడిలా నడుస్తున్నాను.

"ప్రేమ ఎంత మధురం. ప్రియురాలు అంత కఠినం". ఎక్కడో పాట వినిపిస్తోంది.

"అన్నం ఎంత మధురం , మెస్‌వాడు అంత కఠినం"-

నా పేరడీకి నాకు నవ్వు రాలేదు. లాభం లేదు. నా మనస్సు మొద్దుబారుతోంది.

"హాలో సూర్యం !"

వెనక్కు తిరిగి చూశాను. నీలిరంగు జీన్‌పాంటు మీద అదే రంగు చొక్కా టక్ చేసి - కళ్ళకు చలవ జోడుతో ఠీవిగా నవ్వుతూ నిల్చున్న వ్యక్తిని అయోమయంగా చూశాను.

"ఏవిట్రా గుర్తుపట్టలేదా? నేన్రా !" చనువుగా నా భుజం మీద చేయేసి నవ్వుతున్న వాణ్ణి చూసి అప్పుడు గుర్తు పట్టాను. కాలేజ్‌లో క్లాస్‌మేట్సుం. నాటకాల్లో వాడు హీరోవేషం వేస్తే నేను విలన్‌గా వేసేవాణ్ణి.

"ఉమా - నువ్వట్రా?" సంభ్రమాశ్చర్యాలతో అరిచాను.

"అమ్మయ్య ! గుర్తు పట్టావన్నమాట" ఆనందంగా అన్నాడు వాడు. ఆంధ్రాబ్యాంక్‌లో ఆఫీసర్‌గా చేస్తున్నాడట. రెండు రోజుల క్రితమే విజయవాడ నుంచి ఇక్కడికి బదిలీ అయి వచ్చాడట. బాగ్‌లింగంపల్లిలో ఎవరో బంధువులింట్లో దిగాడట.

ఉత్సాహానికీ - చైతన్యానికి మారు పేరులా చెప్పుకుపోతున్నాడు వాడు. నేనూ వాడితోపాటు ఉత్సాహంగా కబుర్లు చెప్పసాగాను. "చెప్పరా - ఏం చేస్తున్నావ్?" పాకెట్‌లోంచి సిగరెట్ తీసి ఆఫర్‌చేస్తూ అడిగాడు.

ఓ క్షణమాగి చెప్పాను. "మా మావయ్య గారి వ్యాపారం చూసుకుంటున్నాను".

"అంటే పెళ్ళి చేసుకున్నావా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"సారీ సోదరా ! హడావుడిగా చేసుకోవలసి వచ్చింది. ఎవర్నీ పిలవలేకపోయాను మావయ్యగారిది ఎగుమతి వ్యాపారం. వేరే ఉద్యోగాలెందుకు? నా తర్వాత నువ్వే గదా చూసుకోవాల్సింది అని ఇప్పట్నుంచే పేరిచ్చి ట్రయినింగ్ ఇస్తున్నారు."

"అదృష్టవంతుడివిరా. వెధవ ఉద్యోగాలు - గొర్రెతోకలాంటి జీవితాలు"- దిగులుగా అన్నాడు ఉమ.

"ఎవరికున్న బాధలు వారికున్నాయి: లేరా !" అన్నా న్నేను.


"అవునవును అంతే"

ఓ అరగంట తర్వాత క్రిస్టల్ బార్‌లో కూర్చున్నాం. నాకు భయంగా ఉంది. గొప్ప కోసం ఏదో నోటి కొచ్చిన కూతలు కూశానుగానీ, ఇప్పుడు బిల్ దగ్గర ఏం ప్రమాదమొస్తుందోనని అనుమానంగా ఉంది. ఆఫ్‌కోర్స్ మందు ఖర్చు వీడుచెల్లించినా - కనీసం సిగరెట్లయినా తాను తెప్పించకపోతే బావుండదు.

"ఏవిట్రా ఇంకా ఓల్డ్‌మంకేనా బ్రాండ్‌మార్చావా?" ఉత్సాహంగా అడిగాడు ఓల్డ్‌మంక్ కాలేజీ రోజుల్నుంచీ మా బ్రాండ్.

'అసలు మందు కొట్టి ఎన్ని యుగాలైంది?' అవునూ.. ఆఖరి సారి మందు కొట్టిందెప్పుడు?

అక్బర్ చనిపోయిన సంవత్సరం గుర్తొచ్చింది గానీ - నేను మందు కొట్టిన సంవత్సరం గుర్తు రాలేదు.



"ఏ బ్రాండయినా. మన పాత రోజుల గుర్తుగా ఓల్డ్‌మాంక్ తెప్పించుకుందాం" స్నేహంకోసం స్కాచ్‌ను త్యాగం చేస్తున్నవాడిలా అన్నాను.

వాడు ఆర్డరిచ్చాడు. "మీ హైద్రాబాద్‌లో మందు రేటు చాలా తక్కువరా. ఇదొక్కటే - నాకు నచ్చింది-" అన్నాడు నవ్వుతూ ఉమ.

బార్‌లో గోడకున్న గడియారాన్ని చూశాను. ఎనిమిదీ నలభై అయిదు.

ఓ రౌండ్ పూర్తయింది. ఉమ గాడు మా కాలేజ్ రోజుల్ని ఉత్సాహంగా జ్ఞాపకం తెచ్చుకుంటున్నాడు. నాకు చాలా ఉత్సాహంగా ఉంది. ఈ రోజు వస్తుంటాననుకుంటే - మందు పార్టీ తగిలింది.

"సత్యవతి గుర్తుందా సోదరా?" ఉమ అడిగాడు.

"థమ్స్ అప్‌లో రమ్ కలిపి తాగించడం ఆవిడే నేర్పిందిగా" ! అన్నాను.

వాడు పెద్దగా నవ్వి "ఎస్ ఆ అమ్మాయే - ప్రస్తుతం హైదరాబాదులోనే ఉంటోందట-"

"అలాగా - పెళ్ళయిందా?"

"పెళ్ళయిందిరా రాస్కెల్ ! వాళ్ళాయనకు ఇక్కడే ఏదో ఉద్యోగమట. వెర్రి ప్రయత్నాలు చేయకు" మందలింపుగా అన్నాడు ఉమ.

నేను పెద్దగా నవ్వాను.

సరిగ్గా పది గంటలకు ఇద్దరం లేచి నిలబడ్డాం.

నేను ఆరు పెగ్గులు కొట్టాను. వాడు ఏడుల్లో ఆగిపోయాడు. నాకు చాలా ఉత్సాహంగా, థ్రిల్లింగ్‌గా ఉంది.

ఉమా గాడు నాకు సాక్షాత్తూ దేవుడిలా కనిపించాడు. ఫ్రైడ్‌రైస్ - చికెన్ మటన్‌బిర్యానీ - చికెన్ సిక్టీఫైవ్ - మటన్ కబాబ్ - ఇవన్నీ ఒకే రోజు లాటరీలో తగులుతాయని నేనూహించలేదు. చాలు. ఈ రోజును తలుచుకుని వారం రోజులు వస్తులుండగలను.

"వెళ్దాంరా - ఆలస్యమైపోయింది"- అన్నాడు ఉమ.

ఇద్దరం బయటకొచ్చాం.

చీకటి కూడా చాలా అందంగా కనిపించింది నాకు.

"నువ్వెక్కడుంటున్నావ్?" అడిగాడు ఉమ.

"బంజారాహిల్స్ - కారు సర్వీసింగ్ కిచ్చాను. నెవర్‌మైండ్. ఆటోలో వెళ్ళిపోతాను" మత్తుగా అన్నాను.

"అయితే పద - నిన్ను ఆటో ఎక్కించి నేను వెళ్తాను" అన్నాడు ఉమ.

"వద్దురా పద బాగ్‌లింగంపల్లి వరకూ సరదాగా నడుద్దాం. అక్కడ్నుంచి నేను వెళ్ళిపోతాను" అన్నా న్నేను.

"అలాగే" అన్నాడు వాడు.

ఇద్దరం నడుస్తున్నాం. తాగిన 'రమ్' మెదడు మీద తన ప్రభావాన్నిచూపిస్తోంది. మత్తుగా ఉంది. అదోలా వుంది. ఇం కేదో అయిపోయేలా ఉంది.

కాకూడదు - వద్దు - అసలు నాకు కాదు. అమ్మో అయిపోతే -వారం రోజులు - కానీ అయితీరుతుంది !

దేవుడా ! కనీసం ఈ సహాయం చేయి !

నా కళ్ళకు లైట్లు వెలుతురు ముద్దల్లా- మసగ్గా - మసుమలు అలికినట్లు త లంతా గిర్రున తిరిగినట్లు.. కళ్ళు తేలిపోయి అడుగులు తడబడి...

"ఏమిట్రా - ఏమైంది?" కంగారుగా అంటున్న ఉమా గాడి స్వరం లీలగా వినిపించింది.

రోడ్డు పక్కగా చెవులు మూసుకుని కూర్చున్నాను. ఐదు నిముషాలు అలాగే. కడుపంతా ఖాళీ అయి తలనరాలు జివ్వున లాగుతూ


"ఏమిట్రా నూరీ ఫుల్ బాటిల్ కొట్టేషాడివి ! ఆరు పెగ్గులకే అవుటయిపోయావే?" ఆశ్చర్యంగా అంటున్న ఉమాగాడిని చూసి చిన్నగా నవ్వాను.

తుపాను వెలిసిన ప్రశాంతత.

"అవున్రా - నాలుగు రోజుల్నుంచి తిండి లేదు. అందుకే కక్కుర్తి పడి పీకల వరకూ తిన్నాను. బయటికొచ్చేసింది.

"అదేమిటి ... మీ మావయ్య.."

పెద్దగా నవ్వి మత్తుగా అన్నాను నేను.




'వదిలెయ్ ఫ్రెండూ. అదంతే. థాంక్యూ - కనీసం తాగి తిన్న తృప్తి నైనా మిగిల్చావ్ - వస్తాన్రా - గుడ్‌బై. !"

తడబడుతూ నడుస్తున్న నాకు తెలుసు. నా వెనుక ఉమాగాడు ఆశ్చర్యంగా చూస్తున్నాడని.

చిక్కడపల్లి వంతెన దగ్గరకు వచ్చిం తర్వాత గుర్తొచ్చింది నాకు. కనీసం - నా జేబులో పది రూపాయల్ని బార్‌లోనైనా మారిస్తే బావుండేదని !

నీరసంగా ఉంది. తలలో నరాలు చిట్లిపోతున్న ఫీలింగ్. ఆకలిని ఆర్పిన ఆల్కహాల్ - బయటి కొచ్చేసరికి - ఆకలి మంట రెట్టింపై - ఏదో ఒకటి తినకపోతే రోడ్డు మీద శోషొచ్చి పడిపోయి రేపు ఉదయం పేపర్లో -

"చిక్కడ్‌పల్లి రోడ్డు మీద గుర్తు తెలీని యువకుడి శవం" - వార్త చదివి జనం చాలా మామూలుగా పేజీ తిప్పేసి -

గప్పున సోకిన కమ్మని వాసనకు తలతిప్పి చూశాను.

రోడ్డు కవతల వీధి లైటు కింద - చిన్న బండి మీద వేడి వేడి వడలు వేస్తున్నాడు.

నలుగురు వ్యక్తులు బండికెదురుగా నిల్చుని ఇడ్లీలు తింటున్నారు

నా మనస్సులో పథకం రూపుదిద్దుకుంది. అవును. వరుసగా నాలుగు ప్లేట్లు లాగించేసి ఆ తర్వాత పది రూపాయలిస్తాడు. వాడు తీసుకుంటే సరే - చెల్లదంటే నా దగ్గర అదే ఉందంటాడు. చచ్చినట్టు తీసుకుంటాడు. లేదా రెండు తిట్లు తిడతాడు.

'వాడేమంటే తన కెందుకు? ఆకలి తీరిపోతే చాలు ! రోడ్ దాటి బండి ముందుకొచ్చి -

"ఓ ప్లేట్ వడ.." అన్నాను. నాలుగు ప్లేట్లు ఒకేసారి అడిగితే వాడు ముందు డబ్బులడగొచ్చు.

వాడు ప్లేట్లో అరిటాకు వేసి - రెండు వడలు చట్నీ వేసి-

నోట్లో లాలాజలం ఊరి పెదవుల కిందుగా కారుతుంటే తుడుచుకోవడానికి రుమాల కోసం జేబులో చేయి పెట్టి ఉలిక్కిపడి - రెండో జేబులో వెతికి షర్ట్‌జేబు వెతికి మరోసారి కుడి జేబు మరుక్షణం ఎడమ జేబు... తర్వాత షర్ట్... ఆ తర్వాత ప్యాంట్ !

నాకు న వ్వొచ్చింది. పెద్దగా కంఠనాళాలు బద్దలయ్యేలా నవ్వాలనుకున్నాను. నా జేబులో పది రూపాయిలూ లేవు. రుమాలా లేదు.

బండివాడి చేతిలో పొగలు కక్కుతున్న వడలను ఓసారి చూసి వెనక్కి తిరిగాను. నెమ్మదిగా నడవసాగాను. నా కిప్పుడు చాలా ఆనందంగా ఉంది. ఇంతసేపూ ఆ పది రూపాయలు ఎలా మార్చాలన్న టెన్షన్‌తో చచ్చిపోయాను. ఇప్పుడు నిండా మునిగాను. ఇంకా చ లెందుకు?

వై.ఎం.సి.ఏ. బస్‌స్టాప్, నా కోసమే ఎదురు చూస్తోంది.

బస్‌స్టాప్‌లో జనం కూడా ఎవరూలేరు.

నెమ్మదిగా వెళ్ళి బస్‌స్టాప్‌లో బెంచీ మీద పడుకుని కళ్లు మూసుకున్నాను.

గాఢనిద్రలోకి జారుకున్నట్టు గుర్తు నాకు ! !